క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి



మంచినీటి చెరువుగట్టుపై కొబ్బరి మొక్క నాటుతున్న సర్పంచ్ బ్రహ్మాజీ తదితరులు

కాజులూరు: గ్రామాకల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ అన్నారు. మంగళవారం గ్రామంలోని మంచినీటి చెరువు గట్టుపై పంచాయతీ సిబ్బందితో కలసి సర్పంచ్ బ్రహ్మాజి కొబ్బరి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు, మంచినీటి చెరువుగట్లపై ఇలా విరివిరిగా కొబ్బరిమొక్కలు నాటడం ద్వారా అవి పెరిగి పెద్దవై వాతావరణ కాలుష్యం తగ్గించడమే కాకుండా పంచాయతీకి మంచి ఆదాయాన్ని తెచ్చిపెడతాయన్నారు. గృహవాసాల్లోనూ ఎక్కువగా మొక్కలు నాటేందుకు ప్రజలు కృషి చేయాలన్నారు.

ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలి

కపిలేశ్వరపురం: శ్రామికవర్గ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పూర్తవుతున్నా శ్రామికవర్గ సమస్యలపై స్పందించక పోవడం తగదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చిరుద్యోగుల జీతాలన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తే ప్రజాగ్రహాన్ని సవిచూడక తప్పదని కృష్ణవేణి అన్నారు.

జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం



అసోసియేషన్ అధ్యక్షుడు వీవీ సుబ్బారావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: మండలంలోని యండగండి గ్రామానికి చెందిన చంద్రు వీర వెంకట సత్య సుబ్బారావు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు సుబ్బారావును పూలదండలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. మిల్లర్స్ అసోసియేషన్ అభ్యున్నతికి తగిన కృషి చేస్తానని అధ్యక్షుడు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, మాజీ సర్పంచ్ రావిపాటి గణేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా శ్రీధర్



నూతనంగా ఎన్నికైన తాలూకా శెట్టిబలిజ నూతన కార్యవర్గం

రామచంద్రపురం: నియోజకవర్గ తాలూకా శెట్టిబలిజ సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో గల తాలూకా శెట్టిబలిజ సంఘ భవనంలో నియోజకవర్గ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ తాలూకా శెట్టిబలిజ అభివృద్ధి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దొంగల శ్రీధర్, ఉపాధ్యక్షులుగా పంపన శ్రీనివాసు, పెంకే విశ్వేశ్వరరావు, కార్యదర్శిగా కోట శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దొంగల శ్రీధర్ మాట్లాడుతూ తాలూకా శెట్టిబలిజ సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ నేతలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, అరెస్టు చేసిన నిందితుడితో ఎస్సై పరదేశి

కపిలేశ్వరపురం: మండలంలోని చినకోరుమిల్లి గోదావరి గట్టు వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా బజాజ్ పల్సర్ బైక్‌పై మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు అంగర ఎస్సై అందే పరదేశి తెలిపారు. యానాం నుంచి బైక్‌పై రూ.3,648 విలువైన ఎనిమిది 750 ఎంఎల్ బాటిళ్లను తరలిస్తున్నట్టు తెలిపారు. నిందితుడు కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంనకు చెందిన ఇ.ధర్మసాయిని అరెస్ట్ చేశారు.

దమ్ము ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

- నిబంధనలు పాటించని ట్రాక్టర్ల యజమానులు
- పట్టించుకోని అధికారులు



కాజులూరు-రామచంద్రపురం రహదారిలో తర్లంపూడి వద్ద రోడ్డుపై యథేచ్ఛగా ప్రయాణిస్తున్న దమ్ముచక్రాల ట్రాక్టర్



దమ్ముచక్రాల ట్రాక్టర్ వెళ్లడంతో ధ్వంసమైన కాజులూరు-ఒంటితాడి రహదారి

కాజులూరు: నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమౌతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీలలో పంట దమ్ముల సమయాల్లో టాక్టరు యజమానులు దమ్ము చక్రాలతో రోడ్లపై యథేచ్ఛగా పయనిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ రహదారులకు సంబంధించిన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు కానీ, పోలీసు విభాగం కానీ వాటిపై చర్యలు చేపట్టడం లేదు. గ్రామీణ రహదారులలో దమ్ము చక్రాల ట్రాక్టర్లను నిరోధించడంలో స్థానిక అధికారులు సైతం విఫలమౌతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గోదావరి నది నుంచి డెల్టా కాలువలకు ఇరిగేషన్ అధికారులు నీరు విడుదల చేయడంతో పాటు గ్రామాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలాల్లో పంటదమ్ములు చురుగ్గా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండల గ్రామాల్లో సుమారు 600 ట్రాక్టర్లు ఉన్నాయి. దమ్ము చేసే సమయంలో ఈ ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించి పొలాల్లో దమ్ము చేస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టరు డ్రైవర్లు, యజమానులు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు ఇనుప చక్రాలతోనే ట్రాక్టర్లతో యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతుండటంతో రూ.లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, తారురోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. ఇనుప చక్రాల దెబ్బకు రోడ్లు పగుళ్లు తీసి రాళ్లు లేచిపోవడంతో రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి.

నియోజకవర్గంలో కాకినాడ-కోటిపల్లి, యానం-ద్వారపూడి, కాజులూరు-రామచంద్రపురం, గొల్లపాలెం-యానం రహదారులతో పాటు పలు గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల తాకిడికి గురై పాడైపోతున్నాయి. దమ్ము చక్రాలతో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా ట్రాక్టర్ యజమానులు లక్ష్యపెట్టడం లేదు. వీటిపై స్థానికులు ఫిర్యాదులు చేసినా ట్రాక్టర్ యజమానుల్లో గ్రామ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు ఎక్కువగా ఉండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు, నోటీసులు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సాహసించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నాతాధికారులు స్పందించి దమ్ము చక్రాల ట్రాక్టర్ల బారి నుంచి గ్రామీణ రహదారులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారులు ధ్వంసమవుతున్నాయి



మండల గ్రామాలలో పలు గ్రామీణ రహదారులు శిథిలమై మరమ్మతులకు సైతం నోచుకోక అధ్వానంగా ఉన్నాయి. వాటిపై దమ్ముచక్రాల టాక్టర్లు వెళ్లడం వలన మరింతగా ధ్వంసమవుతున్నాయి. అధికారులు దమ్ములు పూర్తయ్యే వరకూ రహదారులపై నిఘా ఉంచాలి.

– అనసూరి శివనారాయణ, టి.మామిడాడ

ఇనుప బెల్టులు ఏర్పాటు చేసుకోవాలి



ట్రాక్టర్ యజమానులు దమ్ము చేసేందుకై ఒక పొలం నుంచి మరో పొలం వెళ్లేందుకు టైరు చక్రాలు మార్చుకుని వెళ్లాలి తప్పనిసరి పరిస్థితుల్లో దమ్ము చక్రాలకు ఇనుప బెల్టులు ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయంపై అధికారులు ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలి.

– నల్లమిల్లి అచ్చిరెడ్డి, మొగలిపాలెం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు పయనించడం మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

సబ్సిడీని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వెలంపాలెం పశు గ్రాస క్షేత్రంలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి కృష్ణార్జున

రామచంద్రపురం రూరల్: పశుగ్రాస విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న 75 శాతం సబ్సిడీని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున సూచించారు. మండలంలోని వెలంపాలెంలో పాడి రైతులు బొడ్డు కృష్ణమూర్తి, బొడ్డు ధనరాజులకు చెందిన 2 ఎకరాల పశుగ్రాస క్షేత్రంలో రైతులకు పశుగ్రాసం ప్రాముఖ్యత, పశుగ్రాసం పెంపకానికి అవసరమైన విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాడి రైతులు తామే స్వయంగా పశుగ్రాసం పెంచుకోవడం వల్ల పశువుల దాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. అధిక పాల దిగుబడి సాధించి మంచి లాభాలను పొందవచ్చని వివరించారు. పశుగ్రాసం పెంచిన తరువాత చాఫ్ కట్టర్ ద్వారా 5 నుంచి 6 సెంటీమీటర్ల పొడవున కట్ చేసి పశువులకు అందించడం ద్వారా వృథాను అరికట్టవచ్చని తెలిపారు. ఈ నెల 7 నుంచి 14 వరకు పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పశు వైద్య సహాయకుడు సన్యాసిరావు, 16 మంది పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వసతులు మెరుగుపరచాలి



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకరనారాయణమూర్తి

కాజులూరు: నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో వసతులు మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దూడల శంకరనారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలసి వినతిపత్రం సమర్పించామన్నారు. కాజులూరు మండల గ్రామాలకు మధ్యలో ఉన్న దుగ్గుదుర్రు పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, గొల్లపాలెం, కె.గంగవరం, ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల్లోనూ, రామచంద్రపురం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలోనూ ఆధునిక వసతులు కల్పించి ప్రజలు, రోగులు కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లే అవసరాన్ని తగ్గించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరామన్నారు. జిల్లా ఆరోగ్యశాఖా అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటమని మంత్రి మామీ ఇచ్చారన్నారు.

అలీ అస్కర్‌కు ఘన నివాళి



ద్రాక్షారామ ఆగా వారి పంజాలో అలీ అస్కర్ జూలా



ద్రాక్షారామ అలీ అక్బర్ పంజాలో మజ్లిస్ ఆలపిస్తున్న మత గురువు మౌలానా అస్గర్ ఆబేదీ సాహెబ్

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా కర్బలా పుణ్యభూమిలో మూడో రోజున అశువులు బాసిన ఇమామ్ హుస్సేన్ చిన్న కుమారుడు హజరత్ అలీ అస్కర్ సంతాప దినాన్ని ద్రాక్షారామలో మంగళవారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆరు నెలల చిన్న కుమారుడిని హుర్మూలా అనే శత్రువు బాణంతో పొడిచి చంపిన విషాదకర సంఘటనను కర్ణాటక నుంచి విచ్చేసిన మత గురువు అలీ అస్గర్ అబేదీ సాహెబ్ మజ్లిస్ రూపంలో వివరించారు. అనంతరం అలీ అస్కర్ జూలా(ఊయల)ను ఆగా వారి పెద్ద పంజాలో మాతం చేసి ఊరేగించారు. ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

అలీ అక్బర్ పంజాలో మజ్లిస్

ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొనే మొహర్రం సంతాప దినాల్లో భాగంగా మండలంలోని ద్రాక్షారామ అలీ అక్బర్ పంజాలో మంగళవారం మజ్లిస్ నిర్వహించారు. కర్ణాటక నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా అస్గర్ ఆబేదీ సాహెబ్ మజ్లిస్ ఆలపించి మొహర్రం విషాదం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిం భక్తులు పాల్గొన్నారు.

మాచవరంలో 2,411 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామంలో పాడుబడిన గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు సంయుక్తంగా ఈ దాడి జరిపారు. ఈ దాడిలో 41 బస్తాల్లో నిల్వ ఉంచిన 2,411 కేజీల చౌక బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యం మాచవరం గ్రామానికే చెందిన మేడపాటి రామారెడ్డివిగా గుర్తించారు. రామారెడ్డి రాయవరం పరిసర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.20 రేటుకు బియ్యాన్ని కొనుగోలు చేసి, అదే బియ్యాన్ని కిలో రూ.22 కు ఇటుక బట్టీ కార్మికులకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ బియ్యం నిల్వలకు ఎలాంటి బిల్లులూ లేనందున వాటిని సీజ్ చేశారు. వాటి విలువ రూ 1,09,700 ఉంటుందని భావిస్తున్నారు. నిందితుడిపై 6–ఏ కింద కేసు నమోదు చేసినట్టు సివిల్ సప్లై అధికారులు తెలిపారు. మేడపాటి రామారెడ్డి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా రాయవరం పోలీసులకు సిఫార్సు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌వీ సుబ్బారెడ్డి, ఎస్సై జగన్నాథరెడ్డి, ఏవో భార్గవమహేష్, ఏజీ లక్ష్మీనారాయణ, డీసీ టీవో నవీన్‌కుమార్, ఏఎస్‌వో ప్రసన్నలక్ష్మి, సీఎస్ డీటీ కిరణ్, ఆలీషా, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలసిన వెంకన్నబాబు



తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌తో వెంకన్నబాబు తదితరులు

మండపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు మర్యాదపూర్వకంగా కలిసారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఆ పార్టీ నాయకులు కూసు దొరాజీ, బండెల సాయిరామ్, అబ్బిరెడ్డి వీర్రాజు ఉన్నారు.

హైరిస్క్ గర్భిణుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి



ద్రాక్షారామ పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న రత్నకుమారి

రామచంద్రపురం రూరల్: హైరిస్క్ గర్భిణుల విషయంలో వైద్యులు, వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ వైద్యులకు సూచించారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామ పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులతో ఆయన స్వయంగా మాట్లాడారు. పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది ప్రవర్తన తదితర అంశాలపై గర్భిణులను ప్రశ్నించి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రక్త పరీక్షలు, మందుల పంపిణీ విషయాలను పరిశీలించారు. ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లు రోగులకు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాటు చేసిన కార్నర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ప్రతి నెలా 9 వ తేదీన పరీక్షలు నిర్వహించి రక్త పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారన్నారు. ప్రమాదకరమైన పరిస్థితి ఉన్న గర్భిణులకు స్కానింగ్ రిఫర్ చేసి ఏరియా ఆసుపత్రిలో వారికి చికిత్స అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. రామచంద్రపురం డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ ద్రాక్షారామ పీహెచ్‌సీలో మంగళవారం 31 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 7 గురిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించామన్నారు. వెల్ల పీహెచ్‌సీలో 40 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించామని, వీరిలో ఇద్దరు హైరిస్క్ గర్భిణులుగా గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి భవాని, డాక్టర్ అలేఖ్య, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలశేషు, సీహెచ్‌ఓ వీరవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

24 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగర పీహెచ్‌సీలో మంగళవారం 24 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి పి.రత్నకుమారి గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఇద్దరిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలకు సిఫార్సు చేశారు. తల్లీ బిడ్డల సంరక్షణకై తీసుకోవాల్సిన ఆహార పద్ధతులపై గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు



రాయవరం పీహెచ్‌సీలో గర్భిణులకు ధ్యాన మాతృత్వ పుస్తకాలు అందజేస్తున్న ఫణికృష్ణారెడ్డి

రాయవరం: గర్భిణులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని తూర్పు గోదావరి జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్షి మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా రాయవరం, మాచవరం పీహెచ్‌సీలో గర్భిణులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికృష్ణారెడ్డి రాయవరం పీహెచ్‌సీలో 58 మంది గర్భిణులకు పౌష్టికాహారంగా ఖర్జూరం, బాదంపప్పు, జీడిపప్పు, వేరుశనగ ఉండలు, అంజూరా ఉచితంగా అందజేశారు .అంతకుముందుగా గర్భిణులకు ఆయన యోగా తరగతి నిర్వహించారు. ధ్యాన మాతృత్వం అనే పుస్తకాలను ఆయన గర్భిణులకు పంపిణీ చేశారు. గర్భిణిలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మ ఇస్తారని రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.అనిరుథ్ అన్నారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు



పి.గన్నవరం అక్విడెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: గోదావరి నదికి వరదలు వస్తే ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలకు తావివ్వకుండా వరద ముంపు నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. వరదల సీజన్ నేపథ్యంలో మంగళవారం ఆయన పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడెక్టును పరిశీలించారు. అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న వరద రక్షణ గేట్ల నిర్వాహణ, బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఏటిగట్ల పటిష్టత వంటి అంశాలపై కలెక్టర్ ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్విడెక్టుపై అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు, బ్రిడ్జిపై లైటింగ్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఏటిగట్ల పటిష్టతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అక్విడెక్టుకు చేపట్టాల్సిన మరమ్మతులు, వరదల నేపథ్యంలో లంక ప్రాంత ప్రజల ఇబ్బందులను కలెక్టర్‌కు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్.త్రిశూలపాణి, డీఈఈలు గంగుమళ్ల శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏఈలు టీవీఎల్ఎన్ మూర్తి, సుందర్‌సింగ్, ప్రసాద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రభావిత ప్రాంతాల పరిశీలన

అయినవిల్లి: గోదావరి వరద వల్ల అయినవిల్లి మండలంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ మంగళవారం పర్యటించారు. వరదలకు రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ వరద ప్రమాదంపై సూచనలు చేయాలన్నారు. వీరవల్లిపాలెం పుష్కరఘాట్, ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడిం వద్ద కాజ్‌వే వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక ఇసుక రీచ్ వద్ద వరదనీరు వస్తే నీటి మట్టం ఎంత వరకూ వస్తుందో తహసీల్దార్ ప్రమద్వర, రెవెన్యూ సిబ్బంది ఆర్డీఓకు వివరించారు. వీరవల్లిపాలెంలోని పునరావాస కేంద్రాల వద్ద పరిస్థితిని గమనించారు. ఆర్డీఓ వెంట వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండల పాస్టర్స్ స్పిరిట్యువల్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అంగరలోని ఎం.ప్రకాష్ ఆధ్వర్యంలోని చర్చిలో ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.ఎలీషా, అధ్యక్షుడిగా కె.ఇశ్రాయేలు, ఉపాధ్యక్షుడిగా ఎస్. విజయ్‌బాబు, కార్యదర్శిగా పి.ప్రేమ్‌సుదీర్, కోశాధికారిగా జి.సురేష్, సహాయ కార్యదర్శిగా పి.ప్రసాద్, రికార్డింగ్ కార్యదర్శిగా ఎం.సూర్యప్రకాష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం క్షేత్ర స్థాయిలో క్రైస్తవ భక్తులచే ప్రార్థనలు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మండపేటలో అన్నదానం

మండపేట: వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ సోదరుడు ముమ్మిడివరపు బాపిరాజు పట్టణంలోని పేదలకు అన్నదానం చేశారు. తన సోదరుడైన బాబులు 15వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థలో పేదలకు బాపిరాజు చేతుల మీదుగా అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మారిశెట్టి సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల శివభగవాన్, మెండు మురళి, షేక్ ఆలీఖాన్‌బాబా, కొల్లి చిన్నారావు, జెట్టి స్వప్నకుమార్ పాల్గొన్నారు.

రెండు నెలల వేతనాలు విడుదల చేయాలి

రామచంద్రపురం రూరల్: జిల్లా సమగ్రశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమ్మె జీతాలు, మే, జూన్ రెండు నెలల వేతనాల బడ్జెట్‌లను జిల్లాలకు వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసలే చాలీచాలని వేతనాలతో కుటుంబాలను వెళ్లదీస్తున్నామన్నారు. అవి కూడా సమయానికి రాకుండా ఉండటం వల్ల కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో భోజన విరామ సమయంలో నిరసన తెలపాలని పిలుపు ఇచ్చారు. ప్రతి నెలా సీఎఫ్ఎంఎస్ ద్వారా ఒకటో తేదీనే వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా తమను రెగ్యులర్ చేసే అంశాన్ని పరిశీలించాలని డిమాండ్ చేశారు.

సర్క్యులర్ బజార్‌లోనే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలి

అంబాజీపేట: అమలాపురం సర్క్యులర్ బజార్‌లో ఏర్పాటు చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను యథాస్థానంలో కొనసాగించాలని కోనసీమ కన్జ్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ (కోకోఫెడ్) చైర్మన్ అరిగెల బలరామమూర్తి కోరారు. దీనికి సంబంధించి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బలరామమూర్తి మాట్లాడుతూ గతంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సర్క్యులర్ బజార్‌లో ఉండేదన్నారు.